రెండవ బహుమతి పొందిన కథ

చీకట్లు ముసురుకుంటున్నాయి.

ధన్య తన గదిలో ఒంటరిగా కూర్చుని వుంది.

తల్లికి యివ్వాల్సిన మందులన్నీ యిచ్చింది యిందాకే. యింక రాత్రి పదిగంటల దాకా ఆవిడకి మందు యివ్వక్కర్లేదు.

ఆ రోజు జరిగిన సంఘటనలు, యిదివరకు జరిగిన కొన్ని విషయాలు తల్చుకుంటే తల బరువెక్కి పోతోంది. జరిగిన సంఘటనలన్నీ ఒక్కసారి గుర్తుకొచ్చాయి.

పదిహేనేళ్ళ క్రితం...

ధన్యకి అప్పుడు పంథొమ్మిదేళ్ళు.

ధన్య తండ్రి ధన్య చిన్న పిల్లగా వున్నప్పుడే పోయాడు. పల్లెలో చిన్న యిల్లు. అర ఎకరం పొలం తప్ప ఆస్తి పాస్తులు లేవు. ఉద్యోగం లేదు. ఏ దిక్కూ లేని మనిషిగా, చిన్న పిల్లతో, ఒంటరిగా జీవితాన్ని ఎదుర్కొంది తల్లి అన్నపూర్ణ. ధన్యని పెంచి పెద్ద చేయటానికి ఆవిడ పడని తిప్పలు లేవు. పిండి కొట్టింది. పప్పు రుబ్బింది. అప్పడాలు, ఒడియాలు చేసి అమ్మింది. ధన్య బుద్ధిగా చదువుకుంటూ పెరిగి పెద్దదవుతుంటే చూసి మురిసిపోయేది.

అన్నపూర్ణమ్మకి జీవితంలో ఏ కోరికలూ లేవు. ఆవిడకున్న ఏకైక కోరిక ధన్య సుఖ పడటం. ఆవిడ ఏకైక లక్ష్యం, గమ్యం ఒక్కటే. ధన్య హాయిగా బతకటం.

తనకోసం తల్లి ఎంత కష్టపడుతోందో ధన్యకి అర్థమవుతూనే వుంది. అందుకే యింటర్ పూర్తి కాగానే యిక చదవనని మొండికేసింది. ఏదన్నా ఉద్యోగంలో చేరి తల్లికి శ్రమ తగ్గించాలని ధన్య ఆశ. అప్పటికే టైప్, షార్ట్‌హేండ్ నేర్చుకుని వుంది. హైదరాబాద్‌లో ధన్య ఫ్రెండ్ వుంది. ఆ అమ్మాయి తండ్రికి తెలిసిన ఒక ప్రైవేట్ కంపెనీలో ఎం.డి.కి అసిస్టెంట్ పోస్ట్ ఖాళీ వుందని, ధన్యని యింటర్వ్యూకి రమ్మని రాసింది.

అదృష్టవశాత్తు ధన్యకి ఆ ఉద్యోగం దొరికింది. వెంటనే చౌకలో ఒక యిల్లు చూసుకుని తల్లిని తీసుకుని వచ్చి ఉద్యోగంలో జాయిన్ అయింది. తల్లికి ఆ పల్లెలో చాకిరీ చేసే అవస్థ తప్పిందని ధన్య సంతోషించింది. ఇంట్లో కూడా వీలైనంత పని తనే చేసేది. ఆ విధంగా ఆవిడని సుఖ పెట్టాలని చూసేది.

ధన్య పనిచేస్తున్న కంపెనీ ఎం.డి. వినయ్ రామరాను ధన్య స్వభావం చూసి యిష్టపడటం మొదలు పెట్టారు. దానికి తోడు ఉద్యోగ రీత్యా ఆమెతో ఎక్కువసేపు గడపవలసి రావటం వల్ల ధన్యను పూర్తిగా అర్థం చేసుకున్నాడు అతను.

సడన్‌గా అతను ఒకరోజు పెళ్ళి ప్రస్తావన తెచ్చాడు. ధన్య ఆశ్చర్యపోయింది.

వినయ్ అందగాడు. ఐశ్వర్యవంతుడు. సంఘంలో పేరు, ప్రఖ్యాతి వున్నవాడు. తను మామూలు మనిషి. అతను ఏదో తాత్కాలిక ఆకర్షణలో పడి ప్రేమ అనుకోవటంలేదు కదా. తనను చేసుకున్నందుకు అతను గనక విచారిస్తే తనకు అంత కన్నా అవమానం, దుఃఖం వుండవు.

అదే అనేసింది అతనితో.

వినయ్ నవ్వాడు.

"నేను అన్నీ ఆలోచించుకునే మిమ్మల్ని అడిగాను ధన్యగారూ. మీరు ఔనంటే సంతోషిస్తాను" అన్నాడు.

"మీరెందుకు నన్నే చేసుకోవాలనుకుంటున్నారు" సూటిగా అడిగింది ధన్య.

"నాకు జీవితంలో అన్నీ వున్నాయి. కానీ ప్రేమించే మనిషి లేదు. ప్రేమని, ఆప్యాయతని మించిన ధనం, ఐశ్వర్యం లేదు ధన్యగారూ. ఆ ధనం మీ దగ్గర వుంది. మీరు మీ అమ్మ



# ధన్య

మునిపల్లె లక్ష్మీరమణ కుమారి

గారిని ఎంత ప్రేమిస్తారో కళ్ళారా చూశాను. ప్రేమ నింపిన మీ మనసులో నాకింత చోటు లభిస్తే నాకన్నా ధనవంతుడు వుండడనుకుంటాను" అన్నాడు వినయ్.

ఆ మాటలతో ధన్య అతన్ని పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకుంది.

పెళ్ళి ఘనంగా జరిగిపోయింది.

ధన్య ఎంత బతిమాలినా అన్నపూర్ణమ్మ వాళ్ళతో వుండటానికి ఒప్పుకోలేదు. తమ సొంత ఊరికి వెళ్ళిపోయింది. సొంత యింట్లో వుంటూ పొలం మీద వచ్చే కొద్దిపాటి డబ్బుతోనే ఆవిడ యిన్నాళ్ళూ బతికింది. పెళ్ళయిన ఏడాదికి ధన్యకి రవి పుట్టాడు. ధన్య జీవితం చాలా సుఖంగా గడచిపోతోంది. పద్నాలుగేళ్ళు గడిచినట్లే అనిపించలేదు.

ఇప్పుడు...

అన్నపూర్ణమ్మకి ఆరు నెలలనుంచి ఆరోగ్యం బాగుండటం లేదు. బాగా క్షీణించాక ధన్యకి ఉత్తరం రాసింది. ధన్య వెంటనే బయల్దేరి వెళ్ళి తల్లిని తనతో తీసుకుని వచ్చింది. డాక్టర్లకి చూపించింది. అన్నపూర్ణమ్మకి క్యాన్సర్ బాగా ముదిరిపోయిందనీ, యిక రెండేళ్ళ కన్నా బతకటం కష్టం అనీ తేల్చారు డాక్టర్లు.

ఆవిడ వచ్చాక కొన్ని రోజులు బాగానే వున్నాడు వినయ్. ఆ తర్వాత సణుగుడు మొదలు పెట్టాడు. ఇప్పుడు అసలు ఆవిడ పొడే గిట్టడం లేదు అతనికి.

అన్నపూర్ణమ్మకి ఆహారం యివ్వటం, స్నానం చేయించటం, బట్టలు వెయ్యడం, టాయిలెట్‌కి తీసుకు వెళ్ళడం అన్నీ యింకొక మనిషి వుండి చెయ్యాల్సి వస్తోంది. ధన్య అన్నీ స్వయంగా చేస్తోంది. జాగ్రత్తగా కనిపెట్టుకుని అన్ని అవసరాలూ చూస్తున్నది.

వినయ్, ఆవిడ పనులు చెయ్యనద్దని ధన్యని సతాయించటం మొదలు పెట్టాడు. అదేం చిత్రమో, కొడుకు రవి కూడా తండ్రి పక్షం చేరాడు.

"పని మనిషిని పెట్టి ఆవిడ పనులు చేయించు" అన్నాడు వినయ్.

"నాకిష్టం లేదు. వాళ్ళు నా అంత బాధ్యతగా ఎందుకు చేస్తారు" అన్నది ధన్య.

రెండ్రోజుల క్రితం పెద్ద గొడవ జరిగింది.

"ఇదంతా న్యూసెన్స్‌గా వుంది. ఆవిడ ఎప్పుడు పోతుందో ఏమో. అంతదాకా ఎవరైనా అతిథులు వచ్చినా అసహ్యంగా మూలుగులూ,



మీకు ఆపరేషన్‌కు అంతా సిద్ధం చేసాం. అయితే మా ముగ్గురిలో ఏ ఒక్కరి తప్పుకూ మిగిలిన ఇద్దరం బాధ్యులం కాదు. అందుకే ఫీజు ఎడ్వాన్సుగా చెల్లించాలని కోరుతున్నాం.

మందులూ. పోనీ ఆవిడని హాస్పటల్‌లో చేర్పించెయ్యి. ఎంత బిల్ అయినా కడతాను" అన్నాడు వినయ్.

"ఇంట్లో మనుషుల మధ్య వుంటే ఆవిడకి శాంతిగా వుంటుంది. హాస్పటల్‌లో పేషెంట్ల మధ్య వుంటే తనొక పేషెంట్‌ననే భావం యింకా ఎక్కువై క్షీణించి పోతుంది" అన్నది ధన్య.

"అయితే వేరే యిల్లు చూసి ఆవిడని అక్కడ వుంచి నువ్వు చూసి వస్తూ వుండు" అన్నాడు వినయ్.

"అవును మమ్మీ" అన్నాడు రవి.

ధన్య వాళ్ళ వంక తీవ్రంగా చూసింది.

"కుదరదు. ఆవిడ యిక్కడే మన మధ్యే వుంటుంది. అంతే కాదు. మీరు కూడా ఆవిడకి కావలసిన ప్రేమను, శాంతిని అందించాలి" అన్నది ధన్య.

రవి మాట్లాడకుండా బయటకు వెళ్ళిపోయాడు.

"సిల్లేదు ధన్యా. నేనో ఆవిడో తేల్చేసుకునే సమయం వచ్చింది. బయటకు వెళితే నీకు చిల్లిగవ్వ కూడా యివ్వను. రేపో మాపో పోయే ఆవిడ కోసం పండంటి సంసారాన్ని పాడుచేసుకుంటే నేనేం చేయలేను. ఎల్లుండి కల్లా ఏ విషయం తేలిపోవాలి" అని అరచి వెళ్ళిపోయాడు వినయ్.

ఇవాళ ఏ సంగతి చెప్పేయాలి అతనికి. ధన్య కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి.

కాగితం కలం తీసుకుని రాయడం మొదలు పెట్టింది.

"శ్రీవారికి,

నమస్కారాలు. మీ మాట వింటే జీవితాంతం నీడ పట్టున సుఖంగా విలాసంగా బతుకు గడపవచ్చు. కానీ ఆ సుఖాలు, విలాసాలు నాకు శాంతిని ప్రసాదించలేవు. కన్నతల్లికి కావలసిన సమయంలో చెయ్యాల్సింది చెయ్యలేక పోయాననే అపరాధ భావంతో జీవితాంతం గడిపేకన్నా, నా కోసం రెక్కలు ముక్కలు చేసుకున్న తల్లికి, నా రెక్కల కష్టంతో చివరి రోజుల్లో శాంతిగా, సుఖంగా గడిపే అవకాశం యివ్వడమే మంచిదని నాకనిపిస్తోంది. నిన్ననే నా ఫ్రెండ్ రాధ భర్త కంపెనీలో ఉద్యోగానికి కుదిరాను. వేరే యిల్లు కూడా మాట్లాడాను. మీకూ, రవికీ నా అవసరం లేదు. అందుకే పెద్దగా విచారించరని ఆశిస్తాను.

ధన్య"

ఉత్తరం ముగించి నిలబడ్డ ధన్య ఎదురుగా వున్న వినయ్‌ని చూసింది.

అతని పెదిమలపైనా, కళ్ళల్లోనూ నవ్వు.

"నువ్వే గెలిచావు ధన్యా" అన్నాడు.

"అవును మమ్మీ. ప్లీజ్, డాడీని అపార్థం చేసుకోకు. ఇదంతా నేను చేయమంటేనే డాడీ చేశారు. నువ్వు ప్రాధాన్యత సుఖానికి యిస్తావో, కన్నతల్లికి యిస్తావో చూద్దామని అనుకున్నాం, సరదాకి. నువ్వు ఎప్పటికీ ధర్మం పక్షాన నిలబడతావని డాడీ అన్నారు. ఆయనే గెలిచారు. పద. అమ్మమ్మని చూసి వద్దాం" అంటూ అన్నపూర్ణమ్మ గదిలోకి దారి తీశాడు రవి.

ఇదంతా నాటకమా!

ధన్యకి కోపం వచ్చేసింది.

"పొండి మీతో మాట్లాడనసలు" అన్నది రవి వెనక్కి వెళ్ళి.

"ధన్యా! రవి, వినయ్ నాతో మాట్లాడే ఈ నాటకం ఆడారు. తమాషాగా వుంటుందని నేనూ ఊరుకున్నాను. వినయ్ నాకు నీకన్నా ఎక్కువ. కొడుకు కన్నా బాగా చూసుకునే అల్లుడు దొరకడం నా అదృష్టం" అన్నది అన్నపూర్ణమ్మ.

రవి, వినయ్, అన్నపూర్ణమ్మ నవ్వుతుంటే ధన్యకి కూడా నవ్వొచ్చింది.